మయూరంపై మల్లన్న

- టీటీడీ దేవస్థానం తరపున పట్టువస్త్రాలు
- కిక్కిరిసిన పాతాళగంగ ఘాట్
- నేడు రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు



శ్రీశైలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, అమ్మవారు మయూరవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ముస్తాబు చేసి మయూర వాహనంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలకి తీసుకొచ్చారు. గంగాధర మండపం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, బంజారా నృత్యం, శంఖునాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నందిమండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. వేలసంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీశైల క్షేత్ర వీధులన్నీ కిక్కిరిశాయి. శివదీక్షాపరులు పవిత్ర పాతాల గంగలో పుణ్యస్నానాలు అచరించి భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు రావణవాహన సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలో భాగంగా ఐదవరోజు శనివారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు రావణవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

టీటీడీ, కాణిపాకం నుంచి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఈఓ కె.పెంచలకిషోర్ తోపాటు ఆస్థానాచార్యులు ఫణికుమారశర్మ, అర్చకులు గణేష్‌గుర్‌కుల్ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ జె.శ్యామలరావు దంపతులు భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకస్వాములు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించడం పూర్వజన్మ సుకృతమని టీటీడీ ఈఓ అన్నారు.


కోలాటం ఆడుతున్న కళాకారులు

వివిధ వేషధారణలో కళాకారులు




గిరిజన నృత్యం చేస్తున్న మహిళలు

ఉయ్యాలవాడ సాయుధ పోరాటం

స్ఫూర్తిదాయకం: డీఆర్వో


నివాళులర్పిస్తున్న డీఆర్వో రాము నాయక్

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమని డీఆర్వో రామునాయక్ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. డీఆర్వో రామునాయక్‌తోపాటు రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, తిరుపంరెడ్డి, సాయిరాంరెడ్డి, శివకుమార్‌రెడ్డి పాల్గొని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దేశం కోసం చేసిన త్యాగనిరతిని డీఆర్వో రామునాయక్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రివేళ రాయబేరాలా?

- విజయ డెయిరీ విషయం చంద్రబాబు దృష్టికి
- చైర్మన్‌పై ఎమ్మెల్యే అఖిల ప్రియ ఫైర్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి పగలు ప్రెస్‌మీట్లు పెట్టి.. రాత్రివేళల్లో రాయబేరాలు నిర్వహిస్తున్నాడని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు. డెయిరీని తన సొంత ఆస్తిలా భావిస్తున్న ఆయన వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. శనివారం సాయంత్రం భూమా అఖిల ప్రియ విజయ డెయిరీ కార్యాలయంలో శిరివెళ్ల మాజీ ఎంపీపీ బోయలకుంట్ల శ్రీకాంత్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మాచినేనిపల్లె రైతులు ఎస్వీ జగన్మోహన్ రెడ్డిని నిరాకరిస్తే అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గంగుల మద్దతుతో డెయిరీకి చైర్మన్ అయ్యారన్నారు. కేవలం తన కుర్చీని కాపాడుకునేందుకు సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లను కూడా బలి చేస్తున్నాడన్నారు. శిరివెళ్లతో పాటు 3 సొసైటీలను రద్దు చేస్తారనే వార్తలు వస్తున్నాయని, అదే జరిగితే పాల రైతులకు వచ్చే ప్రయోజనాలు ఆగిపోతాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఐదేళ్లుగా నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మా అబ్బకు నోటీసులు ఇస్తే మాకు ఇచ్చినట్లా అని అగ్రహించారు. శాంతిభద్రతల దృష్ట్యా శివరాత్రి వరకు ఎలాంటి బోర్డు మీటింగ్‌లు నిర్వహించకూడదని కలెక్టర్, డీసీఓ చెప్పినా బోర్డు మీటింగ్ పెట్టడం ఏమిటన్నారు. ఇదిలా ఉండగా భూమా అఖిల ప్రియ విజయడెయిరీలోకి రంగ ప్రవేశంతో కాసేపు టెన్షన్ వాతావరణం కనిపించింది. ఒకవైపు డెయిరీ చైర్మన్, మరోవైపు భూమా అఖిల ప్రియ ఎదురెదురు గదుల్లో ఉండటంతో ఉత్కంఠ చెలరేగింది.



సమావేశంలో మాట్లాడుతున్న భూమా అఖిల ప్రియ

నంద్యాలకు చేరుకున్న మహానందీశ్వరుడు


నంద్యాలకు చేరుకున్న మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: మహానందీశ్వరుని కళ్యాణ పెద్దగా ఆహ్వానించేందుకు మహానంది క్షేత్రంలోని కామేశ్వరీ, మహానందీశ్వరులు శనివారం సాయంత్రం ప్రత్యేక పల్లకిలో నంద్యాలకు చేరుకున్నారు. మహానందిలో జరిగే శివరాత్రి ఉత్సవాలలో మహానందీశ్వరుడి కళ్యాణ పెద్దగా నంద్యాల బ్రహ్మనందీశ్వరుడు వెళ్లి రావడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మహానందీశ్వరుడి ఉత్సవమూర్తులకు ఆత్మకూరు బస్టాండులోని విడది మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో బ్రహ్మనందీశ్వరాలయానికి చేరుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులు కోట వీధిలో పర్యటించి తిరిగి ఆదివారం బ్రహ్మనందీశ్వరుడితో మహానంది ఉత్సవాలకు బయలు దేరనున్నారు. ఈ కార్యక్రమంలో మహానంది ఆలయ సిబ్బంది, అర్చకులు, బ్రహ్మనందీశ్వరాలయ పాల్గొన్నారు.

మూతపడ్డ సీసీఐ కేంద్రాలు



మూతపడిన సీసీఐ కేంద్రం, పెంచికలపాడులో

- ఆవేదనలో పత్తి రైతులు
- సగం పత్తి ఇళ్లు, కల్లాల్లోనే..
- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 40 లక్షల క్వింటాళ్ల దిగుబడి
- సీసీఐ కొనింది కేవలం రూ.4లక్షల క్వింటాళ్లే
- మార్కెటింగ్ అధికారుల నిర్లక్ష్యం..

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 5లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత దిగుబడి ఈసారి రైతుకు అందింది. గతంలో రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికి అందగా..ఈసారి దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా వచ్చిందని రైతులు సంబరపడ్డారు. రైతుల నుంచి క్వింటం పత్తిని సేకరించేందుకు 7,500 చెల్లిస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించడంతో రైతులు సంబరపడ్డారు. అయితే.. పత్తి కొనుగోళ్లను ఉమ్మడి కర్నూలు జిల్లాలో నవంబరు నెలలో ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రాన్ని కూడా తెరవలేదు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో 12 చోట్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మధ్యమధ్యలో వివిధ కారణాలతో రైతుల నుంచి నామమాత్రంగానే పత్తిని కొనుగోలు చేశారు. వాస్తవంగా రైతుల వద్ద ఉన్న పత్తినంతటినీ కొనుగోలు చేస్తామని మొదట్లో మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. అయితే.. గత నెలలోనే పత్తిని కొనుగోలు చేయడాన్ని సీసీఐ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కేంద్రాలను ఎత్తివేశారు. దీంతో ఇంకా పొలాల్లోనే పత్తి ఉంచుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. మరికొంత మంది రైతులు తమ ఇళ్ల కల్లాల్లో టార్పాలిన్లు కప్పి సీసీఐ కేంద్రాలను మళ్లి ఏర్పాటు చేస్తారోనని ఆశతో ఉన్నారు. ప్రతి రోజు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు మంత్రాలయం మార్కెట్ కమిటీల కార్యాలయాల చుట్టూ అదే విధంగా కర్నూలులోని మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయాల చుట్టూ సీసీఐ కేంద్రాలను మళ్లీ తెరిపించాలని మొర పెట్టుకుంటున్నారు.

ఇదేమి దారుణమంటున్న రైతులు

ఇప్పటి దాకా కర్నూలు జిల్లాలోని 12 చోట్ల సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోనిలో 7,240 మంది రైతుల నుంచి 1,70,655 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాల ద్వారా 4,975 మంది రైతుల నుంచి 98,498 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాల నుంచి 2,633 మంది రైతుల నుంచి 83,712 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మంత్రాలయంలో 2,320 మంది రైతుల నుంచి 52,008 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మొత్తం 4,48,074 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించి 297.91 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో రైతులు పండించిన పత్తి 40 లక్షల పైగానే ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే.. సీసీఐ కేంద్రాల్లో అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేసింది కేవలం 4 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే. మరో 16 లక్షల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇంకా 20 లక్షల క్వింటాళ్ల దాకా పత్తి రైతుల పొలాల్లో, ఇళ్లు, కల్లాల్లో మగ్గిపోతోంది. ఈ పత్తిని కూడా కొనుగోలు చేస్తే తప్ప రైతులు బాగుపడే పరిస్థితి ఏ మాత్రం కనిపించడం లేదు.



ఈ రైతు పేరు నాగేష్. కల్లూరు మండలం పెంచికలపాడు గ్రామం. మూడెకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాడు. ఎకరాకు 8 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందనుకున్నాడు. 24 క్వింటాళ్లకు సీసీఐ నుంచి రూ.లక్షన్నర దాకా అందుతుందనుకున్నాడు. ఖర్చులు పోను కనీసం రూ.70వేలు మిగులుతుందని ఆశించాడు. పత్తి ఇంకా పొలంలోనే ఉండగా.. పత్తి కేంద్రాలను ఎత్తివేశారనే పిడుగు లాంటి వార్త అందింది. ఇక వ్యాపారులకే అమ్ముకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్పడంతో నాగేష్ కుంగిపోయాడు. వ్యాపారులు ఇచ్చేది కేవలం రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే. సాగు ఖర్చులు కూడా రావని కన్నీరు మున్నీరవుతున్నాడు. ప్రస్తుతం కర్నూలు నంద్యాల జిల్లాల్లో ఖరీఫ్‌లో పత్తిని సాగు చేసిన దాదాపు 2 లక్షల మంది రైతుల పరిస్థితి నాగేష్ మాదిరే ఉంది.



మిగతా 7వ పేజీలో

ఐక్యంగా అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీ బైరెడ్డి శబరి

నామినేటెడ్ పదవుల్లో బీజేపీ, జనసేనకు 8శాతం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లా అభివృద్ధికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల తరపున కలిసి కట్టుగా పనిచేద్దాం అని నంద్యాల ఎంపీ, లోకసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. శనివారం నంద్యాలలో ఎంపీ కార్యాలయంలో ఎంపీ బైరెడ్డి శబరిని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆశ పెట్టుకున్నారని, వారి ఆశలు వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి పథకం అమలు, నామినేటెడ్ పదవులో బీజేపీ, జనసేన కు 5శాతం అమలు చేయాల్సిందేనని ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, నంద్యాల 3వపట్టణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాప్‌ల దరఖాస్తులకు ఆహ్వానం

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు జాకీర్ హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25కు సంబంధించి రాష్ట్రంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు అవకాశం కల్పించామని వీరితో పాటు అదనంగా కుమ్మరి, మేదరి కులాలకు సంబంధించి గ్రూపుగా, వ్యక్తిగతంగా సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 21నుంచి 60 సంవత్సరాల వయసు మధ్య ఉన్న వారు తెల్లరేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. కుటుంబం నుంచి తెల్లరేషన్‌కార్డులో ఒక్కరు మాత్రమే లబ్ధిపొందేందుకు అర్హులన్నారు. బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు.


మొబైల్ నంబర్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకోవచ్చు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష రాసే విద్యార్థులు మొబైల్ నుండి కూడా హాల్ టిక్కెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని డీఐఈవో సునీత తెలిపారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర కళాశాలలు, రామలింగారెడ్డి కళాశాల, గోస్పాడు ప్రభుత్వ కళాశాల, కోవెలకుంట్లలోని పరీక్షా కేంద్రాలను శనివారం డీఐఈవో పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలను వివరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా సెంటర్‌ల నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీఐఈవో సునీత మాట్లాడుతూ మార్చి 1వతేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు సరిపడా ఫర్నీచర్, గదులలో లైటింగ్, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. హాల్ టిక్కెట్‌లు వారి కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వారి మొబైల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 53 సెంటర్‌లలో 500కి పైగా ఇన్విజిలేటర్‌లను నియమిస్తున్నామన్నారు. అలాగే మూడు టీంలతో ఫ్లైయింగ్ స్క్వాడ్స్, మూడు టీంలతో సిట్టింగ్ స్క్వాడ్స్ ఒక్క డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీతో పరీక్షల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు.

తుంగభద్ర

సాహిత్యం

పూలనిప్పులుతో ప్రయాణం



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'అస్తిత్వానికి ఆసరాగా, బతుక్కి భరోసాగా నిలిచింది కవిత్వం. అవును...బాధలకు బాసటగా ఉండటంలోనే సాహిత్య లక్ష్యం నెరవేరింది...బతకడానికి తెగింపు నిచ్చే అస్త్రాల కుప్పలు.. అదే నేను రగిలించిన ఈ 'పూలనిప్పులు' అంటారు రచయిత్రి స్వయంప్రభ. ఆమె రాసిన పూలనిప్పులు ఇటీవల కాలంలో సాహితీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. జిల్లా నుంచి చక్కని కవిత్వాన్ని 'మధుమాస వీణ' అనే కలం పేరుతో అనతికాలంలోనే గొప్ప కవయిత్రిగా పేరు తెచ్చుకుంటున్నారు స్వయంప్రభ. ఆమె సాహిత్యం చదవలేదు. కేవలం పాఠశాల విద్యవరకే చదువుకున్న ఆమె గొప్పగా కవిత్వం రాస్తున్నారు. తనలోని ఆధునిక స్వతంత్ర ఆలోచనలు స్వయంప్రభ జీవనయానంలోని అనేక సంఘర్షణలు తనతో కవిత్వం రాయిస్తున్నాయేమో అనిపిస్తుంది. పూలనిప్పులు కవితా సంపుటిలో 67 కవితలు ఉన్నాయి. అవన్నీ వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి. తొలి కవితలో 'కష్టాన్ని నమ్ముకుని కన్నీళ్లు దాచుకొని, పరువు విత్తనాలు భూగర్భాన దాచిపెట్టి, చిగురుటాకుల కోసం ఎదురుచూసే శిశిరాన్ని విడిచిన వసంతకాలం, ఆకలి పస్తులకు ఆప్తబంధువులం, ప్రపంచానికి ఆకలి తీర్చే రైతులం' అంటూ బీటలు వారిన దేహంలోని రైతు కష్టాలను కళ్లముందు ఉంచారు. సగటు మహిళ జీవితంలోని సంఘర్షణలకు, సంక్లిష్టతలకు నిదర్శనంగా మది కల్లోలం అంటూ 'ప్రశాంతతకు నలుదిక్కుల వెతికినా...కంటికెక్కడ కనిపించలేదు....అన్వేషించాల్సింది బాహ్య ప్రపంచంలోనే కాదు...హృదయాతరంగంలోనేనని' అంటారు. ప్రముఖ కవి శివారెడ్డి అన్నట్లు శబ్దంతోనో, నిశ్శబ్దంగానో మాటలో మాటై, మనిషి ప్రయాణం చేస్తాడు. ప్రభ కవిత్వం కూడా 'ప్రశ్నిస్తే మారదు సమాజం, ఆచరణాత్మక అడుగులేస్తేనే, మొదటి అడుగు నీదైతే, మరో అడుగు సమాజానిది, వాస్తవమే వేల మాటలేల ఒక్క అడుగు ఆచరణలో చూపు' అంటారు. ఇలా ఈ పుస్తకంలోని కవితలన్నీ వస్తు ప్రధానమై, వివక్ష, మోసం లేని వ్యవస్థ కోసం, ఆర్తితో ప్రేమైక జీవన స్వప్నాల కోసం, చీకటిని చీల్చే ఉషోదయ కిరణాల కోసం రాసినట్లుగా ఉంటాయి. 'నా అక్షరాలు దీన స్వరాలు కాదు/ చైతన్యాన్ని పెంచే ధిక్కార స్వరాలు' అంటూ తన కవితాయానంలో ప్రతిఘటన శరాలు సంధిస్తూ సాగుతున్నారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.



- ఎన్. నాగమణి,
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు,
ఎమ్మిగనూరు

భారతావని భవిత

భారతావని భవిత కోసం...
భిన్నమైన వాదాలను పక్కన పెడదాం
ఈ వసుధైక కుటుంబంలో...
భిన్నత్వంలో ఏకత్వమై
ఓ యువతా ముందడుగు వేద్దాం...!

విశాల భారతం...అనంత సోయగం
హిమగిరులు, జలపాతాలు
గంగా త్రివేణి సంగమాలు...
అబ్బురపరిచే మహారణ్యాలు,
కాశ్మీరం నుంచి
కన్యాకుమారి వరకు
ఈ సువిశాల దేశం సంస్కృతి
సమాహారాల క్షేత్రం
ఓ నవతా ప్రణమిల్లుదాం
మన సంప్రదాయాలకు..!

దేశాన్ని రక్షించే సైనికులు ఎందరో
దేశానికి అన్నం పెట్టే కృషీవలురు
మరెందరో
కార్మికుల శ్రమ జీవనానికీ...శ్రమజీవుల
కష్టార్జితానికి
ఓ యువతా చేద్దామా నిత్య వందనం...!

కులమతాలను దాటి...జాతి విద్వేషాలు
వీడి
ప్రాంతీయ అసమానతా భేదాలు వదలి
మానవీయ విలువలతో, సేవా సహకార
భావాలతో
పుడమి తల్లి రుణం
తీర్చేందుకు, పుణ్యభూమిలా
నిలిపేందుకు
ఓ నవ యువతా వేద్దామా
చైతన్యపూరిత
అడుగులు...!!



-యు. స్రవంతి,
కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని 29 మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఇన్‌చార్జి డీఈఓ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 29 మోడల్ స్కూళ్లలో ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 31వతేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 20వతేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఐదవ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షను తెలుగు లేదా ఇంగ్లీష్ మీడియంలో రాయవచ్చన్నారు. పరీక్ష అనంతరం ఏప్రిల్ 27వతేదీన మెరిట్ లిస్ట్ విడుదల, అదే రోజున సెలక్షన్ లిస్టు ప్రకటించడం జరుగుతుందన్నారు. 30వతేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

పిల్ల చేష్టలా..?



భూమా అఖిలప్రియపై విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ ఆగ్రహం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'డీ ఫాల్టర్‌కు మేమెందుకు సమాధానమివ్వాలి.. ఏంటి పిల్ల చేష్టలా...' అంటూ విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన డెయిరీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యవహరిస్తున్న తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. విజయడెయిరీకి భూమా జగత్‌కు చెందిన డెయిరీ రూ.1.20 కోట్లు బకాయి పెట్టిందన్నారు. ఎన్నిసార్లు నోటీసు ఇచ్చినా స్పందించలేదన్నారు. డెయిరీకి వచ్చినప్పుడు ఆమెతీరు బాగోలేదన్నారు. ఆడబిడ్డ కాబట్టి ఏమీ అనలేకపోతున్నానన్నారు. మరో చోట అయితే మెడ పట్టి గెంటేస్తారన్నారు. జగత్ డెయిరీ వల్ల విజయ పాలసేకరణ లక్ష లీటర్ల నుంచి 70 వేలకు పడిపోయిందన్నారు. తన హయాంలో డెయిరీ టర్నోవర్‌ను రూ.320 కోట్లకు పెంచటంతో పాటు రైతులకు రూ.15 కోట్ల బోనస్ ఇచ్చామన్నారు. శిరివెళ్ల, తదితర సొసైటీలను రద్దు చేయడం వల్ల రైతులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఈ రోజు తాము నిర్వహించిన బోర్డు మీటింగ్‌కు కోరం ఉందని తెలిపారు. మేము తప్పు చేశామని అనిపిస్తే కోర్టు వెళ్లవచ్చని భూమా అఖిల ప్రియనుద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో చైర్మన్‌తో పాటు ఎండీ ప్రదీప్ కుమార్, బోర్డు సభ్యులు ఉన్నారు.

తొలి తరం నవలా రచయిత శిష్టు



శిష్టు కృష్ణమూర్తి

- కవిత్వం, కథా ప్రక్రియల్లోనూ విశేష కృషి
- 67 ఏళ్ల అలుపెరుగని సాహితీ ప్రస్థానంలో కృష్ణమూర్తి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

'నన్ను కదిలించకండి... నేను
సమాజ సంక్షేమాన్ని కాంక్షించి
నిశ్శబ్దంగా ఏకాంతపు మసీదులో
నమాజు చేస్తున్నాను..!
నవ చైతన్య గంగా ప్రవంతిని
ప్రజల మధ్యకు మళ్లించ
తపస్సు చేస్తున్నాను..!
భావి సమాజ శిల్పానికి
ఉత్తమోత్తమ రూపకల్పన
చేయడానికి
నిరంతర యత్నం చేస్తున్నాను...!!'
- శిష్టు కృష్ణమూర్తి

శిష్టు కృష్ణమూర్తి రాసిన కవిత్వంలో ఆలోచనా విధానం ప్రతిబింబిస్తుంది. ఆయన అరవై ఏడేళ్లుగా అలుపెరుగని సాహితీ ప్రస్థానం సాగిస్తున్నారు. ఆయన రాసింది తక్కువే అయినా, వాసిలో అనన్య ఖ్యాతిని సంపాదించారు. కవిత్వం, కథలు రాసినా కర్నూలు జిల్లా నవలా చరిత్రలో తొలి తరానికి చెందిన రచయితగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒక పరిశోధన విద్యార్థి కూడా ఆయన నవలలపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా కూడా పొందారు.

సాహిత్యాభిలాషను పెంచిన 'వసుచరిత్ర'


ఉమ్మడి జిల్లాలోని సిరివెళ్ల మండల పరిధిలోని గుంపరమానుదిన్నె గ్రామంలో 1935లో లలితమ్మ, వెంకట సుబ్బయ్య దంపతులకు జన్మించిన కృష్ణమూర్తి వెలుగోడు, చాగలమర్రి, ఆళ్లగడ్డలలో ప్రాథమిక విద్య చదువుకున్నారు. ఆళ్లగడ్డలో 1954లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తయ్యాక కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక రెండేళ్లు ఇంటి వద్దే వ్యవసాయ పనులు చేస్తూ ఉండి పోయారు. ఆ సమయంలో విరివిగా సాహిత్యం చదివారు. ఆయనకు దొరికి పుస్తకం 'వసు చరిత్ర' ఆయనలో ఎంతో ప్రభావితం చూపించింది. అష్టదిగ్గజ కవులుగా పేర్కొనే రామరాజ భూషణుడు రాసి ఈ పుస్తకాన్ని లెక్కలేనన్నిసార్లు చదివారు. ఉన్నత విద్యకోసం తిరిగి కడప జిల్లా కేంద్రానికి వెళ్లి 1957లో ఇంటర్ ఉత్తీర్ణులయ్యారు. ఇంటికి వచ్చాక మళ్లీ ఆర్థిక ఇబ్బం దులు ఎదుర య్యాయి. దీంతో తాత్కాలిక ఉద్యోగ ప్రయత్నం కోసం హైదరాబాదు చేరుకొని, అక్కడి సచివాలయంలోని రెవెన్యూ బోర్డులో తాత్కాలిక ఉద్యోగాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తన కలానికి పదును పెట్టారు. 'ఫ్లవర్స్ టు గాడ్' అన్న పుస్తకాన్ని రాశారు. చిన్న చిన్న కవితలు తెలుగు, ఆంగ్ల భాషల్లో రాస్తూ సాహిత్యంపై పూర్తిగా దృష్టి పెట్టారు.




'శ్యామల' నవల

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం...

హైదరాబాదులోని సహకార శాఖలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరిన శిష్టు కృష్ణమూర్తికి రాధాకృష్ణమూర్తి అనే సాహితీ మిత్రుడు తోడయ్యాడు. అలా తొలిరోజుల్లో చలం, గోపీచంద్, నండూరి, బుచ్చిబాబు పుస్తకాలు చదివారు. టాగోర్ రాసిన గీతాంజలిని తెలుగులోకి అనువదించారు. ఈ అనువాద కవిత్వం అప్పట్లో కర్నూలులో ప్రచురితమవుతున్న 'ఉజ్వల' వార పత్రికలో ధారావాహికగా అచ్చయ్యింది. ఆనాటి రచయితలు శీలా వీర్రాజు, మంత్రిప్రగడ వీరభద్రమూర్తి పరిచయం, ప్రోత్సాహాలతో 'ఎంకి పాటలు' రాశారు. అవి విశేష ఆదరణ పొంది హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో ప్రసారమయ్యాయి.



జీవన ఘోష నవల



మనసు గతి నవల

జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘంలో..

కర్నూలుకు బదిలీపై వచ్చిన కృష్ణమూర్తికి ఉజ్వల పత్రిక అధినేత మనోహర్, రచయితలు కేఎస్ఎస్ రాజు, భారతుల శివరామకృష్ణ పరిచయం అయ్యారు. కర్నూలు గ్రామీణ మహిళల ఇతివృత్తంగా 'శ్యామల' నవల రాశారు. దీన్ని 1969లో ఎమెస్కో వారు ప్రచురించారు. 'బండ కోసం కొండ కూలింది', 'వేషం వెనుక', 'వైధవ్యం' వంటి కథలు ప్రాముఖ్యత పొందాయి. ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతాన్ని పునాదిగా 'జీవన ఘోష' నవల రాశారు. 'మనసు గతి' అనే మరో నవల కూడా ప్రాచుర్యం పొందింది. 1973లో కర్నూలు జిల్లా రచయితల ప్రచురణ సహకార సంఘం ఏర్పాటు చేసి ఎందరో రచయితల పుస్తకాలు అచ్చువేయడంలో ముఖ్య భూమిక పోషించారు. 'మహాదాశయం' అనే కవితా సంకలనంలో సామాజిక దురాచారాలపై ధ్వజమెత్తారు. జిల్లాలో కరువు పీడిత రైతాంగ జీవనాన్ని చిత్రించే కథలతో కేఎస్ఎస్ రాజుతో కలిసి 'శాపగ్రస్తులు' అనే సంకలనాన్ని ప్రచురించారు.

నాటకానికి బీసీ కృష్ణ సేవలు చిరస్మరణీయం

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా నాటక రంగానికి నటుడు, గాయకుడు, దివంగత బీసీ కృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి కొనియాడారు. శనివారం నగరంలోని మద్దూరునగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ఇటీవల మృతి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కళాకారులు బీసీ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సావిత్రి మాట్లాడుతూ కళాకారులు తమ వృత్తిపట్ల నిబద్ధతతో ఉండాలని అన్నారు. అలాంఠి వారిని సమాజంలో అందరూ ప్రోత్సహించాలని అన్నారు. ఏ రంగంలోనైనా అంకితభావంతో పనిచేసే వారికి ఉన్నత శిఖరాలు ఎక్కే అవకాశం లభిస్తుందని అన్నారు. మరో అతిథి ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా మాట్లాడుతూ బీసీ కృష్ణ వంటి గొప్ప కళాకారుడు దూరం కావడం బాధాకరమని అన్నారు. సభాధ్యక్షత వహించిన సాహితీవేత్త జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ బీసీ కృష్ణ పేరుతో ఏటా అవార్డు ప్రదానం చేసేందుకు రూ.లక్ష అవార్డు నిధిని సేకరిస్తే బాగుంటుందని సూచించారు. సీనియర్ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య మాట్లాడుతూ బీసీ కృష్ణ పేరుతో అవార్డు నెలకొల్పితే ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ నటులు పి. దస్తగిరి, హెచ్. చంద్రన్న, వీవీ రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్, ఇబ్రహీం, సిరాజ్, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, బైలుప్పల షఫీయుల్లా, విశ్రాంత తహసీల్దార్లు సయ్యద్ రోషన్ ఆలీ, సీబీ అజయ్‌కుమార్ తదితరులు బీసీ కృష్ణకు నివాళులు అర్పించారు.



ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, కళాకారులు

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో రేపటి నుంచి జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'గ్రామీణ సమాజ సాధికారత-ఉపాధి అవకాశాలు' అనే అంశంపై ఈనెల 24, 25న సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శనివారం క్లస్టర్ వర్సిటీలోని వీసీ చాంబర్లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లకృష్ణ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు అధిక సంఖ్యలో పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని గ్రామీణ సమాజ సాధికారత నెరవేరేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్, బీఆర్ ప్రసాద్‌రెడ్డి, నాగరాజు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు

- ఐదు, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 6 తేదీ వరకు గడువు




ఆలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో బోధించేందుకుగాను 2025-26 ఏడాదికిగాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ప్రక్రియ ఆరంభం అయ్యింది. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య, వసతిని పొందే అవకాశం ఉంటుంది. ఐఐటీ, నీట్ అకాడమీ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశాలకు వచ్చే నెల మార్చి 6వ తేది వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 డా. బీఆర్ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని అరికేర, సి బెళగల్, చిన్నటేకూరు, నంద్యాల జిల్లాలో జూపాడుబంగ్లా, డోన్ ప్రాంతాల్లో బాలుర ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో డోన్, ఆళ్లగడ్డ రెగ్యులర్, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలో కంబాలపాడు, వెల్దుర్తి, దిన్నెదేవరపాడు, లక్ష్మాపురం ప్రాంతాల్లో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 8,575 మంది చదువుతున్నారు. చిన్నటేకూరులో సైతం బాలుర ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐఐటీ, నీట్‌కు అకాడమీ కోచింగ్ ఇస్తారు. ఈ గురుకులంలో 2023-24 ఏడాదిలో మెడికల్ సీట్లకు 60 మంది రాస్తే 20 మందికి, ఐఐటీ, ఎన్ఐటీలలో 41 మందికి సీట్లు వచ్చాయని జిల్లా డీసీవో శ్రీదేవి తెలిపారు.

దరఖాస్తు చేసేందుకు నిబంధనలు

ఐదో తరగతిలో చేరికకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సీ) విద్యార్థులు 2014 సెప్టెంబర్ ఒకటి నుంచి 2016 ఆగస్టు31 మధ్య పుట్టి ఉండాలి. జూనియర్ ఇంటర్‌లో చేరికలకు 2024-25 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రులకు ఏడాదికి ఆదాయం రూ.1 లక్షకు మించకూడదు. 5వ తరగతి ప్రవేశం కోసం హెచ్ఐటీటీపీ/ ఏపీబీఆర్ఏజీసీఇటీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, ఇంటర్‌కు సంబంధించి హెచ్‌టీటీపీ/ఏపీబీఆర్ఏజీసీఐటీ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్-ఇంటర్నెట్‌లో దరఖాస్తులు చేయాలి. ఒక్కో పాఠశాలలో ఐదు తరగతికి 80 సీట్లు, కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో 80 సీట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. జూనియర్ ఇంటర్ డోన్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల మినహాయిస్తే 14 కళాశాలల్లో 1,120సీట్లు, ఐదో తరగతికి సంబంధించి 15 పాఠశాలల్లో 1200 సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసేందుకు అవసరమైనవి

విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, ఇంతకు ముందు తరగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. సెల్ నంబరు తప్పు లేకుండా నమోదు చేయాలి. ప్రతిభా పరీక్షలో మెరిట్ జాబితా ప్రకారం, నేరుగా సీటు కేటాయిస్తారు.



గురుకులం విద్యార్థులు, క్రీడలు ఆడుతున్న విద్యార్థులు


గురుకులంలో ప్రవేశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం




ప్రతి ఏటా 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తాం. ఐదో తరగతి పిల్లలందరికీ సీటు రావడానికి 4వ తరగతి సిలబస్ వరకు చదివించాలి. ఇంటర్ వారికి పదో తరగతి సిలబస్ చదవాలి. నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం. గురుకులంలో అందించే విద్యా వసతి, మెనూ, ఆటలు వంటి వాటి గురించి తెలియజేస్తున్నాం. ఒకసారి 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంకా ఇంటర్ వరకు అక్కడే ఉచితవిద్యను పొందవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి.

- మనోరాజు, ప్రిన్సిపాల్, అరికేర డా బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, ఆలూరు మండలం

నీటి కో(తి)సం..!



ఎండలు దంచి కొడుతున్నాయి. తాగుదామంటే.. సమీపంలో నీళ్లు కూడా లేవాయే. హా..వాటర్ బాటిల్ దొరికింది. వాటర్ బాటిల్ మూత తీసి ఎలా తాగాలి.. మూత తీయడమెలా?



మూత తీయడం చాలా కష్టమే. ఎలాగబ్బా..



హమ్మయ్య ఎట్టకేలకు వాటర్ బాటిల్ మూత తీసేశా. బాటిల్‌లో నీరు ఉంది.. ఎలా తాగాలబ్బా..



అయ్యో బాటిల్ నుంచి నీళ్లు కిందపడిపోయాయే. బ్యాడ్ టైమ్.

ఫిబ్రవరి మాసం పూర్తికాకనే ఎండలు దంచికొడుతున్నాయి. తాగునీటి ఇబ్బందులు ఈ నాలుగు నెలలు ఎదుర్కోవడం మనుషులకే కాదు.. మూగజీవాలకు కూడా కష్టమే. శనివారం కోసిగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఓ వానరం తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వేసవితాపానికి అద్దం పడుతున్నాయి.
- కోసిగి (ఆంధ్రజ్యోతి)



అయినా పర్లేదు.. హమ్మయ్యా దాహం తీరింది.

మూతపడ్డ సీసీఐ కేంద్రాలు

(5వపేజీ తరువాయి)

దాదాపు లక్షన్నర మంది రైతులు తమ వద్ద ఉన్న పత్తిని సీసీఐ అధికారులకు అమ్ముకునేందుకు మార్కెటింగ్ శాఖ అధికారుల కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఎలాగైనా పత్తిని కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అమ్మించాలని సీసీఐ కేంద్రాలను వెంటనే తెరిపించాలని లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని అధికారులను కోరుతున్నారు. అయితే.. మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం రైతుల వద్ద మిగిలి ఉన్న పత్తి నాణ్యత లేదని, అందువల్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పత్తి ఇంట్లోనే మగ్గుతోంది



నాకు 12 ఎకరాల పొలం ఉంది. పత్తిని అమ్ముకుందామంటే సీసీఐ కేంద్రాలను చెప్పా పెట్టకుండా మూసేశారు. వ్యాపా రులు ఇదే అదునుగా క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే చెల్లిస్తామంటు న్నారు. సీసీఐ కేంద్రాలు మళ్లీ తెరుస్తారేమోనన్న ఆశతో పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నాను. సీసీఐ కేంద్రాలు తెరుస్తారని ఎదురు చూస్తున్నా.

- హనుమంతు, పెంచికలపాడు, రైతు

రైతుల వద్ద ఉన్న పత్తి నాణ్యంగా లేదు



ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న పత్తి నాణ్యంగా లేకపోవడం వల్లనే సీసీఐ అధికారులు కొనుగోలు చేసేందుకు కేంద్రాలను కొనసాగించలేకపోతున్నారు. మాకు వారిపై ఎటువంటి అధికారం లేదు. రైతుల ఒత్తిడి మేరకు ప్రభుత్వానికి సీసీఐ కేంద్రాలను తెరిపించేం దుకు నివేదికను పంపిస్తాం. **- నారాయణమూర్తి, ఏడీఎం**

ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా జారీ చేయండి

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు జాగ్రత్తలు వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో రెవెన్యూ, పంచాయతీ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ వివాహ చట్టం-1955, ప్రత్యేక వివాహ చట్టం-1945ల ప్రకారం వివాహ ధృవీకరణ పత్రాలను కూడా జాగ్రత్తతో జారీ చేయాలని ఆయన తెలిపారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ మాట్లాడుతూ కుల ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న 15 రోజుల్లోపు వాటిని మంజూరు చేస్తామన్నారు. కోడుమూరు తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ మాట్లాడుతూ ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం గ్రామాలలో అయితే.. నెలసరి ఆదాయం రూ.10వేలు లోపు ఉండి, పట్టణాల్లో అయితే.. నెలసరి ఆదాయం రూ.12వేలు లోపు ఉంటే వాటిని జారీ చేస్తామని తెలిపారు. కర్నూలు మున్సిపల్ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మాట్లాడుతూ మరణ, జనన ధృవీకరణ పత్రాలను నమోదు చేసుకున్న 7 రోజులలోపు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఆరోగ్య అధికారి విశ్వనాథ్ రెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి ఈశ్వరయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.లీలా వెంకట శేషాద్రి

ప్రశ్నపత్రం తారుమారు..

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ సప్లమెంటరీ 4వ సెమిస్టర్ పరీక్షలో శనివారం గణితం పరీక్ష ప్రశ్నపత్రం తారుమారైంది. జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 9న పరీక్షలు మొదలయ్యాయి. 4వ సెమిస్టర్ ప్రశ్నప త్రంలో పాత సిలబస్ రావడంతో డోన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఫిర్యాదు మేరకు యాజమాన్యం హుటాహుటిన ఆర్‌యూ పరీక్షల విభాగానికి ఫిర్యాదు చేశారు. వెంటనే పరీక్ష కేంద్రాల్లో రిజర్వ్‌లో ఉంచిన మరో పరీక్షా పత్రం పంపిణీ చేయాలని సూచించారు. గంట ఆలస్యం కావడంతో సమయాన్ని పొడిగించారు. పరీక్షల విభా గం కంట్రోలర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీ సుకె ళ్లగా పరీక్ష యథావిధిగా కొనసాగిందన్నారు.

వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



ఆస్పరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య

ఆస్పరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టబోయే 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో వేద వతి ప్రాజెక్టు నిర్మాణానికి 1000 కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు అభివృద్ధికి 8 టీఎంసీలతో వేద వతి రిజర్వాయర్ నిర్మాణం తప్పనిసరి అన్నారు. 2018లో వేదవతి రిజర్వాయ ర్‌ను నిర్మిస్తామని కోడుమూరులో చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈనెల 28న కూటమి ప్రభు త్వంలో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశ పెడుతున్నందున ఈ సమావేశా ల్లోనే వేదవతి ప్రాజెక్టుకు రూ. 1000కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్య దర్శి విరుపాక్షి, బంట్రోతు శీను, మారెన్న, వెంక టేష్, బాబు, మల్లేష్ పాల్గొన్నారు.

రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

- జిల్లా పరిషత్ సీఈవో జి. నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా నిలిచిన రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. శనివారం నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని జడ్పీ మినీ సమావేశ భవనంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సీసీ ప్రసాద్, పరిపాలన అధికారులు సరస్వతమ్మ, పుల్లయ్య, నాగేంద్రప్రసాద్, బసవశేఖర్, సిబ్బంది రామచంద్రమూర్తి, సిద్దారెడ్డి, మాధవి, , తిరుమలేశ్వరరెడ్డి, పుష్పావతి, జి.మాధవి, కళ్యాణి, కౌసల్య, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ సమాజాన్ని చలిచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

మైనార్టీలపై దాడులు చేస్తూ మైనార్టీలకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చేవిధంగా లేబర్‌కోడ్‌లను మార్పులు చేర్పులు చేయడం సరికాదని హెచ్చరించారు. కార్మిక హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి సీఐటీయూ కార్యకర్తల వర్క్‌షాపు నగరంలో నిర్వహి స్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రామాంజనేయులు, ఈరన్న, సాయిబాబ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

- జిల్లా పరిషత్ సీఈవో

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డు తప్పకుండా ఉండాలని, ఆ కార్డులను వేగవంతంగా అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ నుంచి కర్నూలు,ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సీడీపీఓ, ఐసీడీఎస్, సూపర్‌వైజర్లతో గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేసేందుకు సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. అదే విధంగా మిస్సింగ్ సిటిజన్ల సర్వే వేగవంతం చేయాలన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న సీఈవో నాసరరెడ్డి

గోడ కూలి వ్యక్తి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన గోడ



కోసిగి క్రిష్టప్ప(ఫైల్

కౌతాళం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదిరె గ్రామానికి చెందిన కోసిగి క్రిష్టప్ప(61) తాపి పనులకువెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు గోడ కూలి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన శనివారం జరిగింది. మదిరె గ్రామానికి చెందిన కోసిగి క్రిష్టప్ప గ్రామంలో కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. గ్రామంలో ఒక ఇంటి గోడను తొలగించేందుకు తోటి కూలీలతో పాటు పనికి వెళ్లాడు. అక్కడ ఉన్న ఫలంగా ఇంటి గోడ కూలడంతో పక్కనే పని చేస్తున్న క్రిష్టప్పపై రాళ్ళు పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తోటి కూలీలు రాళ్ళను తొలగించి క్రిష్టప్పను వెలికి తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య దేవమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మా కుమారీస్ సంస్థ నుంచి మైలా రాధాకృష్ణ తొలగింపు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కర్నూలు సేవా కేంద్రం ఓర్వకల్లు శాఖలో పనిచేస్తున్న మైలా రాధాకృష్ణ అనే వ్యక్తిని తొలగించినట్లు కర్నూలు కేంద్రం ఇన్‌చార్జి లీరా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల ఆయన్ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించామన్నారు. అయినప్పటికీ రాధాకృష్ణ బ్రహ్మకుమారీస్ సంస్థ పేరు చెప్పుకుంటూ సత్సంగాలు, బహిరంగ సభలను నిర్వహిస్తున్నాడని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. 'ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థ' నిబద్ధతతో కూడుకున్న సంస్థ అని, ఈ సంస్థ అంతర్జాతీయ ముఖ్య కేంద్రంలో మౌంట్ అబూ రాజస్థాన్‌లోనూ, జోనల్ కార్యాలయం బెంగుళూరులోనూ ఉందని లీరా తెలిపారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు

- ఎస్పీకి ఏపీయూడబ్ల్యూజే ఫిర్యాదు




డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిజాల నిర్భయంగా రాసే జర్నలిస్టులపై కొంతమంది పోలీసు అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఐజేయూ సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడ బ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసగౌడ్ ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. పత్తికొండ, ఆదోనితో పాటు పలు ప్రాంతాల్లో జర్నలి స్టులపై కొందరు పోలీసులు అనుచితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు నమోదుకు పాల్పడుతున్నారన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 2025 డైరీని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆవిష్కరించారు. జర్నలిస్టులు అంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి కలవచ్చని అన్నారు. పోలీసులు తప్పకుండా జర్నలిస్టులకు అండగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు గౌస్, శ్రీనివాస్ నాయక్, యూనియన్ నాయకులు అంజి, శివరాజ్ కుమార్, మధు, అశోక్‌గౌడ్, మస్తాన్, భాస్కర్, మద్దిలేటి, మధు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేశారు..!



ఆర్టీవో కార్యాలయం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ టెస్ట్ కోసం వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత నెలలో ఆన్‌లైన్‌లో ఆర్టీవో కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ కోడ్‌లతో చలానాలు తీశారు. తీరా ఫిట్‌నెస్ స్లాట్ బుక్ అయిన రోజు వెళ్లి ఫిట్‌నెస్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల పిలుపు కోసం పడిగాపులు కాసేవారు... ఎంతకీ పిలుపురాకపోవడంతో గత్యంతరం లేక ధర్నాకు దిగారు. ఈ ఘటన జరిగి 26 రోజులు దాటినా నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో చలానాలు కట్టినవారు లబోదిబోమంటున్నారు.

- 26 రోజులైనా పరిష్కారం కాని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల సమస్య
- లబోదిబోమంటున్న బాధితులు
- రోడ్డెక్కినా.. అందని రీ ఫండ్



ఆర్టీవో కార్యాలయం వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న వాహనదారులు (ఫైల్)

న్యాయం చేయండి..

న్యాయం చేయాలని అటు ఆర్టీవో అధికారులు, ఇటు ఏటీఎస్ సెంటర్ చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకొని చలానాలు కట్టినా న్యాయం జరగలేదని.. తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లయినా ఇవ్వాలని.. లేదా తాము కట్టిన చలానాలను రీ ఫండ్ అయినా చేయాలని వేడుకుంటున్న పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ధర్నా సమయంలో బాధితులతో మాట్లాడిన డీటీవో ఐశ్వర్యారెడ్డి ఈ విషయంలో విచారణ చేసి రెండు రోజుల్లో మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నేటికి 26రోజులు దాటినా వాహనాలకు ఫిట్‌నెస్ ప్రక్రియ చేపట్టలేదన్నారు.. దీంతో వాహనదారులు న్యాయం జరగక తలలు పట్టుకుంటున్నారు.

నెల రోజుల్లో రీ ఫండ్ అవుతుంది



డీటీవో వై.ఐశ్వర్యారెడ్డి మాట్లాడుతూ ఎంతమంది వాహనదారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఆర్టీవో కార్యాలయంలో చలానాలు కట్టారు అన్న వివరాలు లభ్యం కావడం లేదన్నారు. ఇకనుంచి వాహనాల ఫిట్‌నెస్ కోసం చలానాలు ప్రైవేట్ భాగస్వామ్యంలోని ఏటీఎస్ సెంటర్ల ద్వారానే తీయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత బాధితుల చలానాలకు సంబంధించి ఆర్టీవో కార్యాలయం, స్థానిక ఏటీఎస్ సెంటర్ నిర్వాహకులవద్ద ఎలాంటి డేటా లేదని, విజయవాడ ప్రధాన కార్యాలయంలోనే బాధితులు కట్టిన చలానాల సమాచారం నిక్షిప్తమై ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలన్నదానిపై తమ స్థాయిలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో డీటీవో అధికారులకు సైతం ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. విజయవాడలోని ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించి నెలరోజుల్లోపల ఫిట్‌నెస్ కోసం చలానాలు కట్టిన వాహనదారులకు రీఫండ్ జమ అయ్యేలా చూస్తామని తెలిపారు. ఏదిఏమైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం చలానాలు తీసిన బాధితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరి సమస్యకు పరిష్కారం ఏ రూపంలో వస్తుందో వేచి చూడాల్సిందే.

కులగణన చేపట్టాలి

పాములపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన కోసం దేశ వ్యాప్తంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మురళీ మోహన్ అన్నారు. శనివారం పాములపాడులో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఎంఎల్ఏ గిత్తా జయసూర్యను కలిసి ఏపీలో బీసీల కులగణన చేపట్టాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల బీసీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ రామ్మోహన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్‌యాదవ్, రాము, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు భయపడాల్సిన పని లేదు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాలు రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకుంటారనే ప్రచారంలో వాస్తవం లేదని, నిజమైన లబ్ధిదారులు భయపడాల్సిన పని లేదని నంద్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఎమైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వేకు వచ్చే అధికారులకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు.

ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలి

వెలుగోడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాలకు ఎత్తి పోతల పథకాల ద్వారా మెట్టభూములకు సాగునీరు ఇవ్వాలని రైతుసంఘం నాయకులు రాజశేఖర్, నాగేంద్రుడు, ఎల్లాల క్రిష్ణుడు ఎమ్మెల్యేను బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. శనివారం వేల్పనూరులో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చెరువులకు నీరు నింపాలని గాలేరు నదికి రివిట్‌మెంట్ ఏర్పాటు చేయాలని కోరారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కల్పించాలని ఎమ్మెల్యే జయసూర్యకు వాల్మీకి నాయకులు వినతి పత్రం అందజేశారు. శనివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యను వాల్మీకి రిజర్వేషన్ సమితి నాయకులు కలిసి తమ ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ గురించి అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, గౌరీశ్వర నాయుడు, శ్రీనివాసులు, బాల సంజన్న, శివశంకర్, రవి తదితరులు పాలల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నందికొట్కూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 8న నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దివ్య తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల లీగ్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటరీ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి దివ్య పారా లీగల్ వలంటీర్‌లకు చట్టాలపై అవగాహన కల్పించారు. వలంటీర్లు పాటించాల్సిన విధి విధానాలను ఎలా నిర్వహించాలో ఆమె వివరించారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం నియోజకవర్గ ప్రెసిడెంట్ వెంకటరాముడు, సెక్రటరీ వెంకటరమణ, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, మద్దయ్య, అలాగే సీనియర్ లాయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డబ్ల్యూహెచ్‌వో సేవలకు సహకారమందిస్తాం

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఇమ్యూనైజేషన్ డిసీజ్ సర్వేలైన్స్‌లో డబ్ల్యూహెచ్‌వో చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారమందిస్తామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల బొమ్మలసత్రంలో ఎంపీ కార్యాలయంలో డబ్ల్యూహెచ్‌వో అధికారుల బృందం కలిశారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు అడవుల్లోని చెంచు బిడ్డలకు డబ్ల్యూహెచ్‌వో సేవలను విస్తరించాలన్నారు. ఇందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో డబ్ల్యూహెచ్‌వో బృందం డాక్టర్ సందీప్‌పాటిల్, డాక్టర్ భవాని, డాక్టర్ వరం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు 2వేల మంది పోలీసులతో భద్రత

- నంద్యాల జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రీశైలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు 2 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత పాటిల్ తెలిపారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై శనివారం పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు కేటాయించిన ప్రాంతాలలో బాధ్యాతాయుతంగా విధులు ఉండాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, సమర్థవంతంగా పని చేయాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మనోజ్ రామ్నాథ్ హెగ్డే ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు, అడిషనల్ ఎస్పీ ఏ. ఆర్. చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ ఉన్నారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి

నందికొట్కూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరగాలని కర్నూలు పొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం హనుమంతరావు నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నవోదయం 2.0, మద్యం ధరలు, బైండోవర్ల, శాఖలో నమోదైన కేసులు తదితర అంశాలపై ఎస్ఐ జఫ్రూల్లాను అడిగి తెలుసుకున్నారు. మద్యాన్ని ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జఫ్రూల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, కుమారి, శ్వేతా, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఉచితంగా మంజూరైన కళ్లజోళ్లను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జీ.కృష్ణ, వైస్‌ప్రిన్సిపల్ పద్మావతిబాయిల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు.

సామాజిక తనిఖీపై ప్రజా వేదికలో విచారణ

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సామాజిక తనిఖీపై ప్రజా వేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 2023-24లో ఉపాధిహామీ పథకం ద్వారా రూ. 8 కోట్ల 27 లక్షల పనులు చేపట్టారు. అయితే ఈ పనుల్లో అవకతవకలు జరగడం అందులో రూ. 95663ల రికవరికి ఆదేశించారు. అలాగే రికార్డులు, జాబ్ కార్డుల్లో అవకతవలకు గాను రూ.20500ల పెనాల్టీ కింద తిరిగి చెల్లించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ విభాగం అధికారి షీభా, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం,పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఏపీవో నాగమ్మ, ఐటిడిఏ ఏపీవో నాగార్జున,ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రికెట్ అకాడమీ సందర్శన

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టనంలోని భరతమాత గుడి వద్ద నబీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ అకాడమీని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సందర్శించారు. ఫిరోజ్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఆన్‌లైన్ గేమ్‌లకు ఆకర్శితులవుతున్న నేపథ్యంలో అవుట్‌డోర్ గేమ్సులలో పాల్గొనాలని కోరారు. క్రికెట్ అకాడమీలో 100మంది క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ శిక్షకులు గౌస్, తెదేపా పట్టణ అధ్యక్షులు ఖలీల్, మాజీ కౌన్సిలర్‌లు కృపాకర్, మిద్దె చిన్నహుశ్శేణి పాల్గొన్నారు.

అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



అబుల్‌కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాంఆజాద్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కృషి పండ్ల తోటల సంఘం గౌరవాధ్యక్షులు మోమిన్ మునీర్, అధ్యక్షులు మహెబూబ్‌బాషా, రైతు సంఘం అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా పేర్కొన్నారు. శనివారం మౌలానా అబుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆసంఘం కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఉపాధి పనుల నేమ్ బోర్డుల పరిశీలన

కొత్తపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2021-22, 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల ఆడిట్ నేమ్ బోర్డులను ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా ఇన్‌చార్జి విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్ పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని కొత్తపల్లి, శివపురం, నందికుంట, గోకవరం, దుద్యాల గ్రామాల్లో ఈసీ శ్రీనివాసులు, టీఏలతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారి మాట్లాడుతూ గత మూడేళ్లకు సంబంధించిన ఉపాధి పనుల వద్ద ఆడిట్ నేమ్‌బోర్డులు ఏర్పాటు చేశారా లేదా అనే వాటిపై పరిశీలించామన్నారు. గ్రామాల్లో ఆడిట్ బోర్డులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయన వెంట ఈసీ శ్రీనివాసులు, టీఏలు కిరణ్ కుమార్, ఓబులమ్మ, శ్రీరాములు ఉన్నారు.

కొనసాగుతున్న తిక్కస్వామి ఉరుసు ఉత్సవాలు



దర్గావద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సాయిబాబానగర్‌లో వెలసిన హజరత్ సయ్యద్‌షా షెహిన్‌షా (తిక్కస్వామి) దర్గా ఉరుసు సందర్భంగా శనివారం జారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. గాజులు దుకాణాలు, తినుబండారముల దుకాణాలు, చిన్నారుల బొమ్మల దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేడు కొత్తపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ



గామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో సీతారామ చంద్ర స్వామి, ధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ తెలిపారు. పళ్ల పడిగలయ్యశెట్టి వంశస్థుల సహకారంతో నూతనంగా పునఃనిర్మాణం చేపట్టారు. శనివారం ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు దేవతామూర్తుల వేషాధారణలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, చిత్రపటాలతో పాటు చరిత్రకారులు చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళ రెడ్డి సంస్మరణ సభను నంద్యాలలో శనివారం వివేకానంద ఆడిటోరియంలో రేనాటి సూర్యచంద్రుల స్మారక సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, అంతర్జాతీయ శాస్త్రవేత్త రవీంద్రనాద్, డా. రామక్రిష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన, రామలింగారెడ్డి, శ్రీనిధి రఘువీర్, తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, చిత్రపటాలతో పాటు వారి త్యాగాలను వెలుగులోకి తెచ్చిన చరిత్రకారులు తంగిరాల సుబ్బారావు, ముక్కమల్ల నారాయణరెడ్డి, పల్లేటి లక్ష్మీకులశేఖర్, గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి, దేవపల్లి చెంచు సుబ్బయ్య తదితరుల చిత్రపటాలకు పూలమాలలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాహితీ ప్రతినిధులు, కవులు, రచయతలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సాంకేతిక సదస్సు

పాణ్యం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక సదస్సు కాంక్యూరెన్స్ 2కె25 శనివారం ముగిసింది. ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చివరి రెండు రోజులలో నిర్వహించిన 24 గంటల హ్యాకథాన్‌కు పలు కళాశాలల నుంచి దాదాపు 400మంది విద్యార్థులు పాల్గొన్నట్లు సదస్సు కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఈసదస్సు ఎంతో దోహదపడిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్ఓడి డాక్టర్ సుబ్బారెడ్డి, నవీన్ సుందర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావేదిక : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహిచిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, నాయకులు కలిసి కట్టుగా ఉంటూ పార్టీలకు అతీతంగా గ్రామాల అబివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. తుమ్మలూరు గ్రామంలో ఏడాది కాలంగా చెత్తబండ్లు లేవని, వాణాల గ్రామంలో నాడు-నేడు బిల్డింగ్ నిర్మాణం పూర్తి కాలేదని, శాంతినిలయం గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ లేదని, చెలిమిళ్ళ రహదారిలో హైవే నిర్మాణంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం ఎత్తు పెంచాలని తదితర సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలన్నారు. 26 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, అధికారు లు, టీడీపీ నాయకులు మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, హరినాథరెడ్డి, గోవిందు. బండ్లమూరి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి, లింగేశ్‌గౌడ్,, రాముచౌదరి, ఏసేపు, అలీసాహెబ్, పూసలక్రిష్ణ, లింగస్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

మహానంది, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరెడ్డి సూచించారు. శనివారం మహానందిలోని మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెసి కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్విని, ఎంపీడీవో మహమ్మద్ దౌలా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే



వైద్య విద్యార్థులతో కళాశాల ఛైర్మన్, సిబ్బంది

పాణ్యం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శాంతిరాం వైద్య కళాశాల 14 వగ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. అనస్తీషియా ప్రొఫెసర్, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమ వృత్తిలో ఎలా రాణించాలో వివరించారు. వైద్య వృత్తి మాధవసేవలంటిదన్నారు. అనంతరం విద్యార్థులకు ఎంబీబీఎస్ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, కళాశాల ఉపాధ్యక్షురాలు డాక్టర్ మిద్దె మాధవీలత, ఎండీ డాక్టర్ రవిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్ ఆర్ చవాన్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఈడీ మిద్దె రఘురాం, హెచ్‌వోడీలు, పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా, పట్టణ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. బాలచంద్రా సమతా విద్యానికేతన్ పాఠశాలలో రాయలసీమ రీజియన్ ఏపీఎస్ఏ అధ్యక్షులు దండెదస్తగిరి ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఎంపిక చేశారు. నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బత్తిన వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా ఎంజీవీ రవీంద్రనాథ్, కార్యదర్శిగా వాసుదేవారెడ్డి, కోశాధికారిగా ఆరీఫ్, ఉపాధ్యక్షుడిగా నాగరాజారావు, సహాయ కార్యదర్శిగా సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పట్టణ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా రసూల్‌ఆజాద్, అధ్యక్షులుగా సమత బాలచంద్రుడు, కార్యదర్శిగా శ్రీనివాసపాండే, కోశాధికారిగా న్యాయమతుల్లా, ఉపాధ్యక్షులుగా విజయకుమార్‌లను ఎంపిక చేశారు.

చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఫిబ్రవరి 22,23 తేదీలలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జమీవుల్లా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో శని, ఆదివారాలలో చెత్త సేకరణ సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తామన్నారు.

నంద్యాలకు బయలుదేరిన మహానందీశ్వరుడు



నంద్యాలకు బయలుదేరిన మహానందీశ్వరుడి ఉత్సవమూర్తులు

మహానంది, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే కల్యాణానికి పెళ్లి పెద్ద నంద్యాల పట్టణంలోని బ్రహ్మనందీశ్వరుడ్ని ఆహ్వానించేందుకు ప్రత్యేక పల్లకిపై మహానందీశ్వరుడి ఉత్సవమూర్తుల విగ్రహాలు నంద్యాలకు బయలు దేరి వెళ్లాయి. శనివారం సాయంత్రం మహానంది ఆలయంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పల్లకిలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో నంద్యాలకు బయలుదేరి వెళ్లాయి. తిరిగి ఆదివారం పెళ్ళిపెద్ద బ్రహ్మనందీశ్వరునితో పాటు మహానందీశ్వరుని ఉత్సవమూర్తులు మహానందికి చేరడంతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఈవో యర్రమల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత కట్టుదిట్టంగా ఉండాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ జావళి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు భద్రత కల్పించాలని ఏఎస్పీ జావళి సూచించారు. శనివారం రాత్రి బండిత్మకూరు మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని ఓంకార క్షేత్రాన్ని ఎస్పీ పరిశీలించారు. ముఖ్యంగా కూలైన్లు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీల భద్రత తదితర విషయాల గురించి ఎస్ఐ జగన్మోహన్, ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శివరాత్రి పర్వదినాల్లో ఓంకారం, కృష్ణనంది క్షేత్రాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని, పేకాట, జూదం ఆటలు, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఐకి ఆదేశించారు.

సున్నిపెంట: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సంధర్భంగా చేపట్టిన ఏర్పాట్లను నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ ఎన్. యుగంధరబాబు శనివారం పరిశీలించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం, మరుగుదొడ్ల సౌకర్యాలను పర్యవేక్షించాలని, ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



ఏర్పాట్లను పరిశీలించిన అదనపు ఎస్పీ

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మద్దిలేటి స్వామికి పట్టు వస్త్రాలు



మద్దిలేటి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో

బేతంచెర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మద్దిలేటి నరసింహా స్వామి వారికి ఉరుకుంద ఈరన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఈవో, పండితుల ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను శనివారం సమర్పించారు. ఇందులో భాగంగా బాజా భజంత్రీలు నడుమ ఊరేగింపు ద్వారా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ చేసి స్వామివారికి నీరాజనం మంత్రపుష్పాలతో సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.1.48 లక్షలు

మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.1.48 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.1,48,025ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు: ఎంపీపీ



సమావేశంలో నివేదికను చదువుతున్న పశువైద్యాధికారి క్రిష్ణకుమార్

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి సూచించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాయలంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో వరప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వ సభ్యసమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం అయినందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, పెద్దకొప్పెర్ల సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వల్లంపాడు ఎంపీటీసీ సురేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

26న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ. 3వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జ్ఞానజ్యోతితో అంగన్‌వాడీల్లో బోధన మెరుగు

చాగలమర్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల బోధన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న జ్ఞాన జ్యోతి ఇన్‌సర్వీస్ సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిసోర్స్ పర్సన్ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్ర మాన్ని ఎంఈవో అనూరాధ ప్రారంభించారు. సమావేశంలో సూపర్ వైజర్ సుశీల, డీఆర్పీ మాబుహుసేన్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రుద్రవరం : రుద్రవరం ఉన్నతపాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్పీలు మధుశేఖర్, సలీంబాషా, సుభాన్, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యో తి) : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. శనివారం మండలంలోని అతి సమస్యాత్మక గ్రామమైన గొర్విమాను పల్లెలో డీఎస్పీ పర్యటించారు. ఇటీవల భర్త, మామ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న వర్రా సునీత కుటుంబాన్ని డీఎస్పీ ప్రమోద్, సీఐ రమేష్‌బాబు పరామర్శించి, వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

రుద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ చెలిమ రేంజ్ పరిధిలోని పెద్దకంబలూరులో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పశువైద్యాధికారులు పశువులకు వైద్యం అందించారు. ఈసందర్భంగా ఉచితంగా మందులు అందించా రు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, సెక్షన్ ఆఫీసరు కిశోర్ కుమార్, బీట్ ఆఫీసరు రామారావు పాల్గొన్నారు.

క్రీడా కోర్టులు ఏర్పాటు

రుద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రూ.ఐదులక్షలతో నాలుగు క్రీడా కోర్టులను ఏర్పాటు చేయిస్తున్నట్లు హెచ్‌ఎం సుబ్బరాయుడు శనివారం తెలిపారు. ప్రధానమంత్రి స్కూల్ ఫ్రం రైజింగ్‌ఇండియా పథకం కింద వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, లాంగ్‌జంప్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

పార్వేట ఉత్సవమూర్తులకు ఘన స్వాగతం

రుద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో శనివారం సాయంత్రం పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహాస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు గ్రామపెద్దలు అధికారులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. గ్రామం నుంచి తరలివచ్చి కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం ఆవరణంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగనాయకులు, కోలా గురుమూర్తి, సర్పంచ్ విజయలక్ష్మి, అధికారులు రేంజర్ శ్రీపతినాయుడు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు

జోన్ల వారీగా శానిటేషన్ సిబ్బంది నియామకం

బనగానపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాగంటి క్షేత్రంలో నిర్వహిస్తున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జోన్ల వారీగా శానిటేషన్ సిబ్బందిని నియమించినట్లు ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి చెత్తా, చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేశ్, పాతపాడు వీఆర్‌వో శకుంతల, బనగానపల్లె గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ ఏది?

- రోడ్డు పక్కనే చెత్తాచెదారం
- నిప్పుపెడుతుండటంతో ప్రజలు ఇబ్బంది
- నామమాత్రంగా స్వచ్ఛదివస్



మల్లెవేముల రహదారిలో పడేసిన చెత్తా చెదారం

చాగలమర్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో చెత్తాచెదారం రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. చాగలమర్రి మేజర్ పంచాయతీలో ఏళ్లుగా డంపింగ్‌యార్డ్ స్థల సేకరణకు, యార్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామంలోని చెత్తా చెదారం ఆయా రహదారుల్లో వేయడంతో డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్నాయి. చెత్తా చెదారం ఎత్తివేయడానికి ట్రై సైకిళ్లను గతంలో పంపిణీ చేశారు. వాటిని మూలన పడేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కావడం తప్పా చెత్త శుభ్రం చేయడానికి ఉపయోగించలేదు. ట్రాక్టర్లతో నామమాత్రంగా చెత్తాను తొలగిస్తున్నారు. మల్లెవేముల రహదారి, జగనన్న లేఔట్‌లలో వేసిన చెత్తా చెదారానికి నిప్పు పెడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డంపింగ్‌యార్డ్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బ్రాహ్మణపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్ షెడ్లు గాలి, వాన బీభత్సంతో దెబ్బతిని మూడేళ్లవుతున్న ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. హరిత రాయబారులు చెత్తాచెదారం ఊరి చివరలో పడేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని చేపట్టింది. అధికారులు, పారిశుధ్య సిబ్బంది నామమాత్రంగా ఫొటోలకు ఫోజులతోనే సరిపెడుతున్నారు. ఎలాంటి శుభ్రత పనులు, చెత్తా చెదారం తొలగింపు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డంపింగ్‌యార్డ్‌కు స్థలం కేటాయించి రోడ్డుపైనే చెత్త వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఈవోఆర్డీ తాహిర్ హుసేన్‌ను వివరణ కోరగా మండలంలోని 13 గ్రామాల్లో డంపింగ్‌యార్డ్‌లు ఉన్నాయని, చాగలమర్రి మేజర్ పంచాయతీలో స్థల సమస్య వల్ల పనులు జరగలేదన్నారు. మూడు షెడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. ఆయా గ్రామాల్లో పనులు వేగవంతం చేసేందుకు దృష్టి సారించామని, చెత్తా చెదారం కేంద్రాలకు తరలించి పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



హుసేపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలోని చెరువును ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని 38 చెరువులకు నీరు నింపి రైతుల కళ్లల్లో ఆనందం చూడలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే దాదాపు 30 చెరువులకు నీరందుతున్నాయన్నారు. అయితే చిన్నచిన్న సమస్యల వలన పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ సమస్యలను అధికమించి అన్ని చెరువులకు నీరందిస్తామన్నారు. వేసవి ప్రారంభం అయినందున గ్రామాల్లో నీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, ఖాజాపీర్, రాజశేఖర్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డోన్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా

డోన్ రూరల్: పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డోన్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డోన్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించారన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో మార్చి ఆఖరు కల్లా తాగునీటి సమస్య రాకుండా చేస్తామన్నారు. మరో రెండు నెలల్లో ఇంటింటికి కొళాయిల ద్వారా పైపునీరు అందించే కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు.

● **బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ**

సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధిత కుటుంబాలకు మంజూరు అయిన చెక్కులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శనివారం అందజేశారు. బేతంచెర్ల మండలానికి చెందిన బాధిత కుటుంబానికి రూ.76వేల చెక్కును అందజేశారు. అలాగే మరో ఇద్దరికి చెక్కులను అందజేశారు.

ప్రభుత్వ భూములను గుర్తించండి



సోలార్ ప్లాంట్ లీజు భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో విశ్వనాథ్

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సేల్ కంపెనీ వారు అడిగిన ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆర్డీవో విశ్వనాథ్ తెలిపారు. శనివారం గోవిందపల్లె గ్రామంలో పర్యటించి ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సేల్ కంపెనీ వారు 90.84 ఎకరాల ప్రభుత్వ భూమి లీజులకు కావాలని అడిగారన్నారు. అయితే వారు అడిగిన భూమి ఏ స్థితిలో ఉంది, ఎవరి అనుభవంలో ఉందన్నదానిపై సర్వే చేస్తున్నామన్నారు. రస్తాలు, వాగులు, వంకలు, చెరువులకు సంబంధించిన భూములు ఇవ్వలేమన్నారు. అలాగే సీలింగ్, అసైన్డ్ లాంటి సాగు భూములను అనుభవంలో ఉన్న రైతుల అనుమతితో లీజుకు ఇస్తామన్నారు.

రెవెన్యూ సదస్సుల సమస్యలను త్వరగతిన పరిష్కరించండి

ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని ఆర్డీవో విశ్వనాథ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ సర్వేను పూర్తిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

నరసింహారెడ్డి వీరగాథ మరువలేనిది



ఉయ్యాలవాడలో నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సర్పంచ్, అధికారులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరగాథ మరువలేనిదని ఉయ్యాలవాడ గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఆయన విగ్రహానికి గ్రామ అధికారులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపాయిల తిరుబాటు కంటే ముందుగానే బ్రిటీషు వారిపై పోరాడి స్వాతంత్ర్య సమరాన్ని మొదలు పెట్టారన్నారు. భరత మాతను బ్రిటీషు వారి సంకెళ్ల నుంచి విడిపించటంలో నరసింహారెడ్డిది ప్రముఖ పాత్ర అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, వీఆర్వో దాదాసాహేబ్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంటు మనోహర్‌రెడ్డి, మీ సేవా నిర్వాహకుడు పెద్ద మౌలాలి, జయసింహరెడ్డి ఉన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని ట్రెజరీ కార్యాలయంలో విప్లవవీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మానవతాసంఘం బాధ్యుడు రామచంద్రరాజు, ఎమ్మార్పీఎస్, సమాఖ్య , సీనియర్ సిటిజన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుబ్బరాయుడు, కరీంబాషా, సుబ్బారెడ్డి, వెంకటన్న, రెడ్డిపల్లె ఓబయ్య, బాషా, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం పుల్లయ్య ఆచారి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, ఓబులేసు, వెంకటరామిరెడ్డి, సావిత్రి, వేణునాథ్, పీఈటీ చిన్న మౌలాలి, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : పట్టణంలోని వైపీపీఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, నేషనల్ గ్రీన్‌క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి, ఎంఈవో శోభా వివేకవతి, హెచ్‌ఎం వీర రాఘవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంజామల మండలం కానాలలో..



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న అమీర్ బాషా, అధ్యాపకులు

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపాన 2025-26 సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 24నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు న్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు 20-04-2025 ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డోన్ ఆదర్శ పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.75లు, దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నీటి కుండలు పంపిణీ

డోన్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెప్రసీ కాలనీలో ప్రజలకు నీటి కుండలను పంపిణీ చేసినట్లు ప్రార్థన సమయం నిర్వాహకులు జానీ ప్రభాకర్ తెలిపారు. శనివారం దాతలు కళావతి, రిటైర్డు హెచ్‌ఎం గ్రేస్ ఆర్థిక సాయంతో కుండలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, వృద్ధులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

సంజామల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన ప్రతిచోట ప్రజల మన్ననలు పొందాలని తహసీల్దార్ అనిల్ కుమార్ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఆర్‌ఐగా బదిలీ అయిన లక్ష్మీకుమారిని తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో సర్వేయర్ క్రిష్ణయ్య, మల్లేశ్వరీ, వీఆర్‌వోలు ఎరుకలయ్య, బాల కంబయ్య, చెంగయ్య, సుబ్బరాయుడు, గుర్రప్ప, కంబగిరి, నరసింహా రెడ్డి, శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజారెడ్డి పరామర్శ

బనగానపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్తాఫ్‌హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సర్వర్ సమస్య

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సర్వర్ సమస్య వెంటాడుతోంది. దీంతో రైతు వివరాల నమోదు కార్యక్రమం ముందుకు సాగడంలేదు. ఉన్నతాధికారులు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని లక్ష్యాలను విధిస్తుండటంతో అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని వ్యవసాయ శాఖ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రోజుకు 15, 20మంది నమోదు కూడా కావడంలేదని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

చాగలమర్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తుల పల్లకి సేవ శనివారం చేశారు. మాఘమాసం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కిలో టమోటా రూ.5



డోన్‌లో కూరగాయల మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన టమోటా

డోన్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డోన్ కూరగాయల మార్కెట్‌లో టమోటా ధర పడిపోయింది. డోన్ మార్కెట్‌లో కిలో టమోటా రూ.5లకు విక్రయించారు. టమోటాతో పాటు వంకాయలు కూడా కిలో రూ.10లు పలికింది. కూరగాయలలో టమోటా ధర పూర్తిగా పతనం కావడంతో టమోటా రైతులు ఆందోళన చెందారు. ఈ ధరతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరెడ్డి తిరుణాల ప్రారంభం

ప్యాపిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం అవదూత వెంకటరెడ్డి తిరుణాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు స్వామివారిని పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. రెండవ రోజు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

ప్యాపిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎరుకుల సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ మనోరమ అన్నారు. శనివారం ఆమె ప్యాపిలిలో మాట్లాడుతూ ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీగా గిరిజన మహిళ ప్రసన్నను నియమించడంపై సీఎం చంద్రబాబును ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన ప్రజలంతా చంద్రబాబుకు రుణపడి ఉంటారన్నారు.

పీ-4 సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను సచివాలయ సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వేలో కుటుంబాల పూర్తి వివరాలు ఉంటాయని అన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని అన్నారు. సచివాలయ సిబ్బంది కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ ఉన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సావిత్రి తెలిపారు. మండలంలో 24 నుంచి 28వ తేదీ వరకు మొబైల్ ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందన్నారు. 24న కొండాపురం, 25న బుర్రారెడ్డిపల్లె, 27, 28న చాకరాజువేముల గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులలో తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

28లోపు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్రెంటిషిప్‌గా నమోదు చేసుకోవాలని మెప్మా టీఎంసీ సుజాత శనివారం తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నైపుణ్య శిక్షణా సంస్థ ద్వారా స్టైఫండ్ పొందే అవకాశం ఉందన్నారు. పట్టణ ఎస్‌హెచ్‌జీ సభ్యులు వారి కుటుంబ సభ్యులలో 2021 తర్వాత డిగ్రీ పూర్తయినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి నెలా రూ.4,500లు స్టైఫండ్ అందించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంకు, ఖాతా, ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ అవసరం ఉంటుందన్నారు. కేంద్ర, విద్య మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్‌డీసీ పరిశ్రమల నుంచి మూడు సర్టిఫికెట్లు అందుతాయన్నారు.

పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎద్దుపెంట గ్రామా పంచాయతీకి మైక్రో వాటర్ షెడ్ 2.0 పనులకు సంబంధించిన కేంద్ర,రాష్ట్ర ఫండ్స్ మంజూరు కానున్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు స్పింకర్లు, పీవీసీ పైపులు, ఆయిల్ ఇంజన్లు, పవర్ స్ప్రేర్స్, తార్పాలిన్లు, ట్రాక్టర్ గంటుక, నాగేళ్లు కూడా ఉంటాయని వాటర్ షెడ్ పీవో విజేత తెలియజేశారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దొర్నిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు కేసీకెనాల్ కాలువ వద్ద అమ్మిరెడ్డినగర్ గ్రామానికి వెళ్లే రహదారిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మృతుడు కొంత కాలంగా చుట్టుపక్కల గ్రామాల్లో బిక్షాటన చేస్తుండేవాడన్నారు. అనారోగ్యం తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృ తు డి వయసు దాదాపు 60 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రంగయ్య తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను భర్త అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపి న వివరాల మేరకు కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హారిణి అనే మహిళ ఇదే పట్టణానికి చెందిన యువకుడు సాదిక్‌హుసేన్‌ను మూడు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరి దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా సాగింది. ఇటీవల భర్త , అతడి కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారని హారిణి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవరాజుపల్లె గ్రామ సమీపంలోని నాపరాళ్ల పరిశ్రమ వద్ద బెల్ట్ షాపుపై పోలీసులు దాడులు నిర్వహించారు. 16 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీన పర్చుకున్నట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు శనివారం వెల్లడించారు. గ్రామానికి చెందిన బాట రామమూర్తి అనే వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.